ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- సాంస్కృతిక, మేధోపరమైన మార్పిడికి 'కాశీ తమిళ సంగమం' శక్తిమంతమైన వేదికగా ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు.

- నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్ కల్పించడం నిర్ణయాత్మకమైన ముందడుగు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు.

- రాష్ట్రంలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు రేపు జరగనున్నాయి.

- పౌరుల నమ్మకాన్ని నిలబెట్టేలా న్యాయవ్యవస్థ పనిచేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్ ఆకాంక్షించారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'మన్ కీ బాత్-మనసులోని మాట' కార్యక్రమం 140వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

==========

ఏళ్ల తరబడి సాంస్కృతిక, మేధోపరమైన మార్పిడికి 'కాశీ తమిళ సంగమం' ఒక శక్తిమంతమైన వేదికగా ఎదిగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు. ఇది 'శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. వారణాసిలో 'కాశీ తమిళ సంగమం 5.0' ఈరోజు ప్రారంభమైన సందర్భంగా ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు వారణాసిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 'కాశీ తమిళ సంగమం 5.0' వేడుకలను ప్రారంభించి, 50 భాషల్లో అనువదించిన తిరుక్కురళ్ గ్రంథాలను ఆవిష్కరించారు. కాశీ, తమిళనాడుల మధ్య తరతరాల నాగరికత బంధం ఉందని, దేశంలోని భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని వేడుకలా జరుపుకోవడం ఎంతో ముఖ్యమని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొన్నారు.

==========

నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్ కల్పించడం మహిళా సాధికారత దిశగా ఒక నిర్ణయాత్మకమైన ముందడుగు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా పోస్టు పెట్టారు. దక్షిణాది వాటా యథాతథంగా ఉంటుందని, ఆంధ్రప్రదేశ్ లోక్ సభ సీట్లు 25 నుంచి 38కు పెరుగుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ బిల్లును ఏకాభిప్రాయంతో ఆమోదించాలని అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లును వ్యతిరేకించడం అంటే మహిళల హక్కును నిరాకరించడమేనని పేర్కొన్నారు.

==========

రాష్ట్రంలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు రేపు జరగనున్నాయి. ఇప్పటికే 23.52 శాతం సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రెండో దశ పంచాయతీ ఎన్నికలు 52 రెవెన్యూ డివిజన్లలోని 246 మండలాల్లో 3వేల 880 గ్రామపంచాయతీలలో నిర్వహించనున్నారు. 3వేల 803 సర్పంచ్ స్థానాలకు 10 వేల 295 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 29 వేల 603 వార్డు సభ్యులకు గాను 63వేల 395 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రెండోదశలో 83 లక్షల 50 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియ పూర్తయింది. రేపు ఉదయం ఏడు గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ జరగుతుంది. రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతారు.

==========

సమస్యలతో కోర్టుకు వచ్చే పౌరుల నమ్మకాన్ని నిలబెట్టేలా న్యాయవ్యవస్థ పనిచేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్ ఆకాంక్షించారు. రాజమహేంద్రవరంలోని ఈరోజు నిర్వహించిన న్యాయఉత్సవంలో ఆమె మాట్లాడుతూ.. రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ఏర్పడి 222 సంవత్సరాలు, బార్ అసోసియేషన్ 131 ఏళ్లు పూర్తి చేసుకోవడం చరిత్రాత్మక మైలురాయి అని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. కృత్రిమ మేధ, డిజిటల్ వ్యవస్థలు, క్వాంటం సాంకేతికత వంటి అంశాలను న్యాయవాదులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకుని ప్రజలకు వేగంగా, మెరుగైన న్యాయ సేవలు అందించాలని సూచిస్తూ...

(వాయిస్...27 సెకన్లు)

==========

నియోజకవర్గాల పునర్విభజన రెండో సవరణ బిల్లు-2026 ను లోక్ సభ పరిశీలనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సిఫార్సు చేశారు. రాజ్యాంగం 132వ సవరణ బిల్లు-2026, నియోజకవర్గాల పునర్విభజన రెండో బిల్లు-2026కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన మరుసటిరోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ బిల్లులు చట్టరూపం దాల్చితే అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య 50 శాతం మేర పెరగడంతో పాటు, 2029 లోక్ సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమమవుతుందని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ స్పష్టం చేశారు. ప్రతిపాదిత డీలిమిటేషన్ వ్యవస్థ దేశ పార్లమెంటరీ రూపురేఖలను పునర్నిర్వచించే కీలక అడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

==========

విరామం

==========

ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడే నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్-మనసులోని మాట' 140వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ సందర్భంగా దేశ విదేశాల్లోని ప్రజలతో ప్రధానమంత్రి తన ఆలోచనలను, పలు కీలక విషయాలను పంచుకోనున్నారు. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్‌లతో పాటు ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్, న్యూస్ ఆన్ ఏఐఆర్ మొబైల్ యాప్ లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది. అలాగే ఏఐఆర్ న్యూస్, డీడీ న్యూస్, ప్రధానమంత్రి కార్యాలయం (PMO), సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ యూట్యూబ్ ఛానళ్లలోనూ ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లోనూ కార్యక్రమాన్ని ప్రసారం చేయనుంది.

==========

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ టి. నిశాంతి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లపై ఈరోజు జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు.

పశ్చిమగోదావరి జిల్లాలో పంచాయతీ ఎన్నికలు నిర్వహణపై అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

విశాఖ జిల్లా పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు రేపు పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. పోలింగ్ జరిగే ప్రాంతాల పరిధిలోని స్థానిక ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించినట్లు వెల్లడించారు.

==========

2025 సంవత్సరానికి గాను నంది టీవీ ఫిల్మ్ అవార్డుల ఎంపికకు జ్యూరీ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నంది టీవీ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ నియామకంపై సాధారణ పరిపాలన శాఖ జీవో ఆర్టీ నంబర్ 2210ను జారీ చేసింది. మొత్తం 13 మందితో కూడిన నంది టీవీ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు ఇచ్చింది. నంది టీవీ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీ ఛైర్మన్ గా కొమ్మనాపల్లి గణపతిరావును నియమించారు.

==========

పెన్షనర్ల జీవన ప్రమాణ పత్రాల (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) సమర్పణను మరింత సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ నిర్వహిస్తున్న 'మెగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్-5.0' ఈరోజు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రారంభమైంది. కార్యక్రమంలో ఢిల్లీ కంట్రోలర్ జనరల్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ (సీజీసీఏ), కార్యాలయ అడిషనల్ సీజీసీఏ డాక్టర్ షికా మాధుర్ కుమార్ మాట్లాడుతూ దేశంలో టెలికాం, డిజిటల్ విప్లవానికి బాటలు వేసిన పెన్షనర్ల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'నేషన్ ఫస్ట్-సిటిజన్ ఫస్ట్' స్ఫూర్తితో దేశవ్యాప్తంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ సేవలను వినియోగించే సమయంలో పెన్షనర్లు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

==========

గోవాలో జరుగుతున్న 57వ అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవం (IFFI) ముగింపు వేడుకలు కొద్దిసేపటి క్రితం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ప్రభాత్ మాట్లాడుతూ, ఈ ఏడాది నిర్వహించిన మాస్టర్ క్లాసులు, బ్రిక్స్ దేశాల చిత్ర ప్రదర్శనలు, రష్యా-స్పెయిన్ ప్రత్యేక చలనచిత్ర ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. చలనచిత్రోత్సవం మేనేజింగ్ డైరెక్టర్ ధీరజ్ సింగ్ మాట్లాడుతూ, ఈ ఏడాది అంతర్జాతీయ భారతీయ చలనచిత్రోత్సవం ను "యువ ప్రతిభ ఉత్సవం"గా అభివర్ణించారు.

==========

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించిన టికెట్లు, టోకెన్ల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడీ) ఈరోజు ఆన్ లైన్ లో విడుదల చేసింది. వచ్చేనెల 20 నుంచి 29వ తేదీ వరకు పదిరోజుల పాటు వైకుంఠ ద్వారాల ద్వారా దర్శనాలకు అనుమతిస్తారు. టోకెన్లు కావాల్సిన భక్తులు టిటిడి అధికారిక వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని టిటిడీ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే 30వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు పేర్కొంది.

==========

నగరంలో నెల రోజులపాటు చేపట్టనున్న 'మిషన్ హెల్దీ విజయవాడ' కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ వంగవీటి రాధ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన సమీక్ష సమావేశంలో మేయర్ మాట్లాడారు. మిషన్ హెల్దీ విజయవాడ'ను కేవలం తాత్కాలిక పారిశుధ్య కార్యక్రమంగా కాకుండా నగర పరిశుభ్రతలో శాశ్వత మార్పు తీసుకొచ్చే ఉద్యమంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజారోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు.

==========

నీతి ఆయోగ్ సభ్యురాలు డా.జోరమ్ ఆనియా (Joram Aniya) తో కూడిన బృందం అమరావతిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ తో ఈరోజు సమావేశం అయింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్య, పర్యాటక, యువజన సంక్షేమ రంగాల్లో చేపట్టిన వివిధ పథకాలు, ప్రాజెక్టులు, కార్యక్రమాల అమలును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, కార్యక్రమాల అమలు తీరును డా.జోరమ్ ఆనియాకు అధికారులు వివరించారు.

==========
==========